# అన్నీ ఉచితాలా.. అప్పు కూడా పుట్టదు

- తాకట్టులో రోడ్డు రవాణా సంస్థ, వివిధ కార్పొరేషన్ల ఆస్తులు
- నీటి పారుదల ప్రాజెక్టులపై పాలకులకు పట్టింపు లేమి
- తెలుగు రాష్ట్రాల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి



హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): 'ఓట్ల కోసం ఇబ్బడి ముబ్బడిగా ఉచిత పథకాలతో నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణను జీతాలు చెల్లించలేని స్థితికి తెచ్చారు.. ఆర్టీసీ, కార్పొరేషన్లు, ఇతర ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టి ఇబ్బడి ముబ్బడిగా అప్పులు తెచ్చి భవిష్యత్తులో అప్పులే పుట్టకుండా చేస్తున్నారు' అంటూ మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. ప్రజలు ఉచితాలకు ఆశపడి పిల్లల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. శనివారం ఆయన విజయవాడలో ఉచిత పథకాలపై తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలను సంధించారు. రాజకీయ నాయకులు ప్రజల సొమ్మును ఉచితాల పేరిట పంచిపెడుతూ ఫొటోలకు పోజులిస్తున్నారని దెప్పి పొడిచారు. పాలకులు పది కాలాలపాటు ప్రజలకు ఉపయోగపడే నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని విస్మరించడం విచారకరమని పేర్కొన్నారు. ప్రాజెక్టులు ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ఆర్థికంగా ఎదిగారని గుర్తుచేశారు. భవిష్యత్తు తరాల గురించి ఎంతమంది పాలకులు ఆలోచిస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలని చురకలంటించారు. అనేక మంది చిన్న వయసులోనే అనారోగ్యాల బారిన పడుతున్నారని, మందులు కూడా కొనలేని పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం మినహా మరేదీ ఉచితంగా ఇవ్వకూడదని అభిప్రాయపడ్డారు.

# పౌరుల వాట్సాప్‌పై ఐటీ నజర్

- ఏప్రిల్ 1 నుంచి కొత్త చట్టం అమల్లోకి
- ఈ-మెయిల్ తదితర ఖాతాలపైనా నిఘా
- అక్రమ ఆర్థిక లావాదేవీల వెలికితీతే లక్ష్యం





న్యూఢిల్లీ, మార్చి 29: కొత్త ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1, 2025) నుంచి ఆదాయ పన్ను(ఐటీ) శాఖ అధికారులు ప్రజలకు సంబంధించిన డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారాలైన వాట్సాప్, టెలిగ్రామ్, ఈ-మెయిల్ అకౌంట్లపై నిఘా పెట్టనున్నారు. ఆదాయపు పన్ను చట్టం, 2025 నిబంధనల ప్రకారం ప్రజలకు చెందిన ఈ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారాల ఖాతాలపై ప్రభుత్వం డేగ కన్ను వేసి అక్రమ ఆర్థిక లావాదేవీల ఆట కట్టించనున్నది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 13న లోక్‌సభలో ఈ బిల్లును ఎందుకు ప్రవేశపెట్టాల్సి వచ్చిందో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మార్చి 27న సభ్యులకు వివరించారు. ఈ చట్టం ప్రకారం లెక్కల్లో చూపని నగదు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు ప్రభుత్వానికి అనుమతి ఉంటుంది. పాత చట్టంలోని దాదాపు అన్ని నిబంధనలు కొత్త చట్టంలో కూడా ఉంటున్నప్పటికీ భాషను సరళతరం చేయడం కొత్త చట్టం ప్రధాన లక్ష్యమని నిర్మలా సీతారామన్ తెలిపారు. డిజిటల్ ఖాతాలలో లభించే సాక్ష్యాలను పన్ను ఎగవేత నిరూపణకు సాక్ష్యాలుగా అధికారులు కోర్టులలో సమర్పించడానికి అవకాశం ఉటుంది. ఇటీవల మొబైల్ ఫోన్లలో ఎన్‌క్రిప్ట్ అయిన(భద్రపరిచిన) మెసేజ్‌లు రూ. 250 కోట్ల లెక్కల్లో చూపని ధనం వెలికితీతకు దారి చూపాయి. వాట్సాప్ మెసేజెస్ ద్వారా క్రిప్టో ఆస్తుల గుర్తింపు జరిగింది. రూ.200 కోట్ల లెక్కల్లో చూపని ధనం వెలికితీతకు వాట్సాప్ కమ్యూనికేషన్ తోడ్పడిందని నిర్మల తెలిపారు. గూగుల్ మ్యాప్స్ హిస్టరీ సాయంతో నల్ల ధనాన్ని దాచేందుకు తరచూ సందర్శించిన ప్రదేశాలను గుర్తించడం జరిగినట్టు ఆమె వెల్లడించారు. బినామీ ఆస్తుల యజమానిని నిర్ధారించేందుకు టెలిగ్రాం ఖాతాలను విశ్లేషించినట్టు మంత్రి తెలిపారు.

# నిద్రకు ముందు ఫోన్‌తో మెదడుకు చేటు!

- వారానికి ఓ గంట నిద్ర నష్టం కూడా
- అమెరికన్ క్యాన్సర్ సొసైటీ అధ్యయనం



న్యూఢిల్లీ: నిద్రకు ఉపక్రమించే ముందు ఫోన్‌ను స్క్రోల్ చేసేవారు వారానికి దాదాపు 50 నిమిషాల నిద్రను కోల్పోతారని తాజా పరిశోధన వెల్లడించింది. మెదడు కూడా దెబ్బ తినొచ్చని హెచ్చరించింది.రోజూ స్క్రీన్ టైమ్ వల్ల శరీరంలోని జీవ గడియారం క్రమం తప్పుతుందని తెలిపింది. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ పరిశోధకులు తమ తాజా అధ్యయన నివేదికలో ఈ అంశాలను వెల్లడించారు. 1,22,000 మందిపై ఈ అధ్యయనం జరిగినట్లు పరిశోధకులు తెలిపారు. వీరిలో 41 శాతం మంది తాము రోజూ నిద్రకు ఉపక్రమించే ముందు ఫోన్‌ను వాడతామని చెప్పగా, 17.4 శాతం మంది ఆ సమయంలో తాము ఫోన్‌ను వాడటం లేదని తెలిపారు. ఆ సమయంలో ఫోన్‌ను వాడనివారి కన్నా వాడేవారి నిద్ర సక్రమంగా పట్టకపోయే అవకాశాలు 33 శాతం ఎక్కువగా కనిపించాయి.

**మెలటోనిన్ ఆలస్యం.. నిద్రకు భంగం**

మెలటోనిన్ హార్మోన్ నిద్ర పోవడం-మేలుకోవడం క్రమబద్ధంగా జరిగేలా సాయపడుతుంది. ఫోన్ లేదా ఇతర డిజిటల్ స్క్రీన్ నుంచి వచ్చే వెలుగును చూడటం వల్ల మెలటోనిన్ విడుదల ఆలస్యమవుతుందని, ఫలితంగా సహజ నిద్రకు భంగం కలుగుతుందని ఈ అధ్యయనం తెలిపింది. నిద్రకు ఉపక్రమించే ముందు 30 నిమిషాలపాటు సామాజిక మాధ్యమాలను చూసే వయోజనులు నిద్ర పోవడంలో అంతరాయాలు, కలత నిద్ర సమస్యను ఎదుర్కొనడం 1.62 రెట్లు ఎక్కువయ్యే అవకాశం ఉందని తెలిపారు. నిద్ర కోల్పోవడమనేది వ్యక్తి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కార్యకలాపాల నిర్వహణ, జ్ఞాపక శక్తి, భావోద్వేగాల నియంత్రణ, సావధానంగా ఉండేలా చేసే మెదడులోని భాగాలపై ఈ ప్రభావం పడుతుందని తెలిపారు. దీంతో దీర్ఘకాలంలో ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, వ్యాకులత రుగ్మతలకు దారి తీస్తుందని వివరించారు.

# కథ మారింది.. కల చెదిరింది

- అమెరికాలో మన వాళ్లను వెంటాడుతున్న ఉద్యోగ భద్రత, నిరుద్యోగ భయం
- ట్రంప్ ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరి.. వెంటాడుతున్న డిపోర్టేషన్ ముప్పు
- సంపాదన తక్కువై, కుటుంబ పోషణ భారమైందని పలువురు యువత ఆవేదన





న్యూయార్క్, మార్చి 29: లక్షలాది రూపాయల అప్పు చేసి అగ్రరాజ్యం అమెరికాకు ఉన్నత విద్యకు వెళ్లిన భారతీయులు ఇప్పుడు కళ్లముందే డాలర్ డ్రీమ్స్ చెదిరిపోతుండటంతో బావురుమంటూ నిస్సహాయంగా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పోనీ భారత్‌కు తిరిగి వెళ్లిపోదామంటే లక్షలాది రూపాయల అప్పు, తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలు కళ్ల ముందు కదలాడుతూ తీవ్ర అనిశ్చితితో కొట్టుమిట్టాడుతున్నారు. ట్రంప్ తాజా వలస నిబంధనలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలపై ఆంక్షలు, దేశ బహిష్కరణ శిక్షలతో వారు క్షణమొక యుగంలా గడుపుతున్నారు. 27 ఏండ్ల భారతీయ విద్యార్థి ఒకరు రెడిట్‌లో తన అనుభవాన్ని పంచుకుంటూ.. 'అమెరికాలో మాస్టర్స్ చేయడానికి 40 లక్షల అప్పు చేసి 2022లో ఇక్కడకు వచ్చా. పలు కారణాలతో ఉద్యోగం రాకపోవడంతో బలవంతంగా భారత్‌కు తిరిగొచ్చేయాల్సి వచ్చిం ది. ఇక్కడ నేను సంపాదించిన ఉద్యోగం ద్వారా 75 వేలు వస్తున్నాయి. అయితే అందులో 66 వేలు బ్యాంక్ లోన్ ఈఎంఐకే పోతున్నాయి. నెలకు రూ.9 వేలతో ఐదుగురు సభ్యుల కుటుంబాన్ని పోషిస్తూ భారంగా జీవితాన్ని నెట్టుకొస్తున్నానని' అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

**ట్రంప్ రాకతో విద్యార్థులకు ఎక్కువ కష్టాలు**

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రావడంతో వీసా, వలస నిబంధనలు కఠినతరం చేయడంతో పలువురు భారత విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**క్షణక్షణం బిక్కుబిక్కు**

అగ్రదేశానికి వెళ్లి ఉంటున్న వారిలో అధికంగా 25-32 ఏండ్ల వారు ఉంటున్నారు. విదేశాలకు వెళ్లి మాస్టర్స్ పూర్తి చేసినా, పరిమిత ఉద్యోగ అవకాశాల కారణంగా వీరు తీవ్ర గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు ఏ అధికారి వస్తాడో, తమను దేశం నుంచి బహిష్కరిస్తారోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఒక ఇమ్మిగ్రేషన్ స్టడీస్ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం 2023 ఆర్థిక సంవత్సరానికి 7 వేలకు పైగా భారతీయ విద్యార్థులు వీసా గడువు ముగిసినా అక్కడే నివసిస్తున్నారు. ఇలా ఉంటున్న అంతర్జాతీయ విద్యార్థులలో భారతీయులే అధికం. ఐటీలో గ్రాడ్యుయేట్ అయిన 26 ఏండ్ల విద్యార్థి మాట్లాడుతూ ఇక్కడ ఉండటం కోసం నిత్యం అధికారులతో పిల్లి-ఎలుక ఆట ఆడాల్సి వస్తున్నదని, ఇలా ఎంతకాలం ఉండగలమని ప్రశ్నించాడు.

**సంకెళ్లతో కన్నా మర్యాదగా వెళ్లిపోవడమే మంచిది**

'నేను వలస నిబంధనలను ఉల్లంఘిస్తున్నానని నాకు తెలుసు. అయినప్పటికీ చట్టబద్ధంగా ఇక్కడ ఉండటానికి ప్రయత్నిస్తున్నా. అయితే ట్రంప్ వచ్చాక పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు భారత్‌కు వెళ్లిపోవడం తప్ప నాకు మరో మార్గం కన్పించడం లేదు.' అని కాన్సస్‌లోని 27 ఏండ్ల ఫైనాన్స్ గ్రాడ్యుయేట్ ఆవేదన వ్యక్తం చేశాడు. చేతులు, కాళ్లకు సంకెళ్లతో మన దేశానికి ఒక నేరస్థునిలా బలవంతంగా వెళ్లే కంటే ఇప్పుడే గౌరవంగా వెళ్లడం మంచిది కదా అని అన్నాడు.

**అమెరికా జీతాలతో పోల్చవద్దు**

అమెరికాలో మాస్టర్స్ చేసి తప్పనిసరి పరిస్థితుల్లో భారత్‌కు వచ్చే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలకు లోటు లేదని, అయితే వారు అక్కడి జీతాలతో ఇక్కడి జీతాలను పోల్చడం వల్లే చిక్కు వస్తున్నదని కార్పొరేట్ సంస్థలో హెచ్‌ఆర్ హెడ్‌గా ఉన్న ఒక్కరు తెలిపారు. డాలర్, రూపాయి విలువల్లో తేడా కారణంగా ఇక్కడి కన్నా అక్కడ రెట్టింపు, మూడు రెట్లు జీతాలు ఉంటాయని, అలాగని, వారు ఇక్కడికి వస్తే ఇచ్చే జీతాలు తక్కువేమీ కావని ఆయన చెప్పారు.

## అమెరికాకు వ్యతిరేకమైతే తిరిగి వెళ్లిపోండి

- పలువురు విదేశీ విద్యార్థులపై బహిష్కరణ వేటు
- వీసాలను రద్దు చేస్తున్నట్టు డీఓఎస్ ఈ-మెయిళ్లు

న్యూయార్క్: అమెరికాలో విద్యనభ్యసిస్తున్న విదేశీ విద్యార్థులకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కష్టాన్ని తెచ్చిపెట్టారు. వారిలో కొందరిపై దేశ బహిష్కరణ పిడుగు వేశారు. పలువురి వీసాలను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం సంచలన ప్రకటన చేసింది. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ వారు స్వచ్ఛందంగా అమెరికాను వదిలిపెట్టి వెళ్లిపోవాలంటూ వందలాది మందికి యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ (డీఓఎస్) నుంచి ఈ-మెయిళ్లు అందాయి. ఇలా అందుకున్న వారిలో భారతీయులు కూడా ఉన్నట్టు తెలిసింది. వీసాలు రద్దయిన వారు తక్షణం దేశాన్ని విడిచి వెళ్లాలని, లేదంటే తామే బలవంతంగా తరలిస్తామని హెచ్చరించింది. హెచ్చరిక ఈ మెయిళ్లు అందుకున్న వారు తమ దేశాలకు వెళ్లానుకుంటే సీబీపీ హోమ్ యాప్‌ను వినియోగించుకోవచ్చునని ప్రభుత్వం వారికి సూచించింది.

## జేఈఈ అడ్మిట్ కార్డుల విడుదల

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్-2 అడ్మిట్‌కార్డులు విడుదలయ్యాయి. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల అడ్మిట్‌కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) శనివారం విడుదల చేసింది. ఏప్రిల్ 4వరకు అడ్మిట్‌కార్డులను ఎన్టీఏ విడుదల చేయనున్నది. జేఈఈ మెయిన్ బీటెక్ పరీక్షలు ఏప్రిల్ 2, 3, 4,7, 8 తేదీల్లో జరగనున్నాయి. 9న బీ ఆర్క్, బీ ప్లానింగ్ పేపర్లకు పరీక్షలు నిర్వహిస్తారు.

## పెట్టుబడి పేరుతో రూ.6.3 కోట్లకు టోకరా

**డేటింగ్ యాప్‌లో చీటింగ్**

న్యూఢిల్లీ: డేటింగ్ యాప్‌లో ఒక మహిళ వలలో చిక్కి ఒక ఉన్నతోద్యోగి రూ.6.3 కోట్లు పోగొట్టుకున్నాడు. నోయిడాకు చెందిన దల్జీత్ సింగ్‌కు ఒక డేటింగ్ యాప్‌లో అనిత పేరుతో ఒక మహిళ పరిచయమైంది. ఆ పరిచయం బలపడి స్నేహంగా మారింది. ఆ మహిళ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే తక్కువ టైమ్‌లో ఎక్కువ డబ్బులు వస్తాయని నమ్మించడంతో దల్జీత్ తొలుత ఆమె సూచించిన మూడు వెబ్‌సైట్లలో 3.2 లక్షలు పెట్టుబడి పెట్టాడు. గంటల వ్యవధిలోనే రూ.24 వేలు లాభం రావడంతో ఆ తర్వాత ఆమె సలహాపై రూ.6.5 కోట్లు పెట్టుబడి పెట్టాడు. అయితే తర్వాత వాటిని విత్ డ్రా చేసేందుకు వీలు కాకపోవడం, ఆ వెబ్‌సైట్‌లు పనిచేయకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**రూ.15 లక్షల ప్యాకెట్ కేసులో**

## మాజీ జడ్జి నిర్దోషి

చండీగఢ్: రూ.15 లక్షల డబ్బు ప్యాకెట్ కేసులో పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నిర్మల్ యాదవ్ నిర్దోషిగా తేలారు. చండీగఢ్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు శనివారం ఈ మేరకు తీర్పు చెప్పింది. కేసు వివరాల్లోకి వెళితే.. 2008 ఆగస్టు 13న అప్పటి పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తి నిర్మల్‌జిత్ కౌర్ నివాసానికి ప్రకాశ్ రామ్ అనే ఒక వ్యక్తి వచ్చి ఢిల్లీ నుంచి వచ్చిన పత్రాలు ఉన్నాయంటూ ఒక ప్యాకెట్ ఇచ్చారు. అయితే అందులో రూ.15 లక్షల విలువైన కరెన్సీ కట్టలు బయటపడటంతో ప్రకాశ్‌రామ్‌ను పోలీసులకు అప్పగించారు. జస్టిస్ నిర్మల్ యాదవ్ నివాసానికి బదులు నిర్మల్‌జిత్ కౌర్‌కు ఆ డబ్బును హర్యానా మాజీ అడ్వకేట్ జనరల్ సంజీవ్ బన్సల్ తన ప్యూన్ ద్వారా ఇచ్చినట్టు సాక్షులు తెలిపారు. దీంతో జస్టిస్ నిర్మల్ యాదవ్ పదవీ విరమణ రోజు సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది.

## నేపాల్‌లో చల్లారిన 'రాజరికం' హింస

ఖాట్మండు: నేపాల్‌లో మళ్లీ రాజరికం అమలు చేయాలని ఆ దేశ మాజీ రాజు జ్ఞానేంద్ర షా మద్దతుదారులు శుక్రవారం రాజధాని కాఠ్మాండూలో విధ్వంసానికి పాల్పడ్డారు. అయితే భద్రతా దళాలు ఆందోళనకారులను సమర్థంగా అడ్డుకోవడంతో శుక్రవారం విధించిన కర్ఫ్యూను శనివారం తొలగించారు. శుక్రవారం టిన్‌కునేలోని ఒక రాజకీయ పార్టీ కార్యాలయంపై రాళ్లతో దాడి చేసిన నిరసనకారులు వాహనాలకు నిప్పు పెట్టడంతోపాటు దుకాణాలలో లూటీలకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో ఒక టీవీ కెమెరామెన్‌తో సహ ఇద్దరు వ్యక్తులు మరణించగా పోలీసులు, ఆందోళనకారులు కలిపి 110 మందికిపైగా గాయపడ్డారు.

## 'జలియన్‌వాలా బాగ్'పై బ్రిటన్ క్షమాపణ చెప్పాలి

**కన్జర్వేటివ్ ఎంపీ డిమాండ్**

లండన్: జలియన్‌వాలా బాగ్ ఘోర నరమేధంపై క్షమాపణ చెప్పాలనే డిమాండ్ బ్రిటన్ పార్లమెంటులో మారుమోగింది. బ్రిటిష్ కన్జర్వేటివ్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ ఇటీవల పార్లమెంటు కామన్స్ సభలో మాట్లాడుతూ, 1919 ఏప్రిల్ 13న పంజాబ్‌లోని జలియన్‌వాలా బాగ్‌లో జరిగిన దారుణ నరమేధాన్ని ధ్రువీకరించి, భారత దేశానికి క్షమాపణ చెప్పాలని బ్రిటన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సామూహిక హత్యాకాండ జరిగిన రోజు బ్రిటిష్ చరిత్రలో మాయని మచ్చ అని వ్యాఖ్యానించారు. ఈ నరమేధాన్ని చీకటి అధ్యాయంగా 2019లో అప్పటి బ్రిటన్ ప్రధాని థెరిసా మే గుర్తించారని, క్షమాపణ చెప్తూ అధికారిక ప్రకటన మాత్రం జారీ చేయలేదని అన్నారు.

## మహారాష్ట్రలో డయేరియా విజృంభణ

**స్వచ్ఛ భారత్ టాయిలెట్స్ లీకేజీలే కారణం**

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని పలు జిల్లాల్లో డయేరియా(అతిసారం) విజృంభిస్తున్నది. జల్‌గావ్, పుణె, రాయ్‌గడ్, సతారా, సాంగ్లి, సింధుదుర్గ్, కొల్హాపూర్, రత్నగిరి జిల్లాల్లో డయేరియా కేసుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ఇందుకు గల కారణంపై అధ్యయనం చేసిన ఐరాస సంస్థ 'యునిసెఫ్' కీలక వివరాల్ని వెల్లడించింది. ప్రధానంగా స్వచ్ఛ భారత్ మిషన్ కొనసాగిన జిల్లాల్లోనే సమస్య నెలకొన్న విషయాన్ని గణాంకాలతో సహ బయటపెట్టింది. సరైన నాణ్యత, నిర్వహణ లేకుండా సామాజిక మరుగుదొడ్లు కట్టడం, గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కింద సెప్టిక్ ట్యాంక్‌ల నిర్మాణాలు అలాగే ఉండటం వ్యాధి ప్రబలడానికి కారణమై ఉండొచ్చునని పేర్కొన్నది. రాష్ట్రంలో 2022-2024 మధ్యకాలంలో కలుషిత నీటి వల్ల సోకే కలరా, టైఫాయిడ్, గ్యాస్ట్రిక్ సమస్యల వంటి తీవ్రమైన డయేరియా వ్యాధులు 80 శాతం వరకు పెరిగాయి. స్వచ్ఛ భారత్ మిషన్ కింద అత్యంత నాసిరకంగా నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు వ్యాధు లు ప్రబలడానికి ముఖ్య కారణమని 'యునిసెఫ్' నివేదిక పేర్కొంది. గ్రామాల్లో సెప్టిక్ ట్యాంకుల్లోని మలం పొంగిపొర్లుతూ బయటకు రావటం, వ్యాధులు ప్రబలడానికి దారి తీసిందని యునిసెఫ్ ముంబై ఇన్‌చార్జి కబీర్ చెప్పారు.

## కశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లోని కథువా జిల్లాలో భద్రతా దళాలు-ఉగ్రవాదుల మధ్య కొనసాగిన ఎన్‌కౌంటర్‌లో శుక్రవారం ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. వీర మరణం పొందిన ఐదుగురు పోలీసుల నుంచి ఉగ్రవాదులు దొంగిలించిన ఆయుధాల కోసం అన్వేషణ జరుగుతుండగా ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. మిగిలిన అనుమానిత ఉగ్రవాదుల కోసం గాలింపు కొనసాగుతున్నది. కశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురిందర్ చౌదరి మాట్లాడుతూ, ఉగ్రవాదాన్ని వీడనాడాలని పాకిస్థాన్‌ను కోరారు. హింస వల్ల సాధించేది ఏమీ ఉండదన్నారు.



మయన్మార్‌లో తాజా భూకంపం ధాటికి కుప్పకూలిన ఓ భవనం

# భూకంప మృతులు 1600 పైనే

- మయన్మార్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు
- మృతుల సంఖ్య పది వేలు ఉండొచ్చని అంచనా!
- మళ్లీ స్వల్ప ప్రకంపనలు.. బాసటగా నిలిచిన దేశాలు

బ్యాంకాక్, మార్చి 29: శుక్రవారం వరుస భూ కపంపాలతో వణికిపోయిన మయన్మార్‌లో శనివారం మరోసారి భూప్రకంపనలు నమోదయ్యాయి. మధ్యాహ్నం 2.50 గంటల సమయంలో 4.7 తీవ్రతతో భూమి కంపించినట్టు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. కాగా శుక్రవారం నాటి భూకంప మృతుల సంఖ్య 1644 దాటింది. శనివారం అనేక భవనాల శిథిలాల నుంచి మృతదేహాల వెలికితీత కొనసాగింది. మృతుల సంఖ్య 10 వేలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 3,408 మంది గాయపడ్డారని, మరో 139 మంది గల్లంతయ్యారని మయన్మార్ సైనిక ప్రభుత్వం ప్రకటించింది. కాగా, భూకంప మరణాల సంఖ్య ఊహించని స్థాయిలో ఉండవచ్చని వార్తలు వస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం వచ్చిన వరుస భూకంపాల ధాటికి నగరంలోని అనేక బహుళ అంతస్తుల భవనాలు నేలమట్టం కాగా రోడ్లు చీలిపోవడంతో వంతెనలు కూలిపోయాయి. ఒక డ్యామ్ బద్ధలైంది. పొరుగున ఉన్న థాయ్‌ల్యాండ్‌లో కూడా భూకంపం తీవ్రతకు గ్రేటర్ బ్యాంకాక్ ప్రాంతంలోని అనేక భవనాలు కూలిపోయాయి. శిథిలాల నుంచి ఇప్పటివరకు 6 మృతదేహాలను వెలికితీయగా 26 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. మరో 47 మంది ఆచూకీ తెలియడం లేదని వారు చెప్పారు. కాగా, శుక్రవారం బ్యాంకాక్‌లో పురిటి నొప్పులతో బాధ పడుతున్న మహిళకు వైద్యులు ఓ పార్కులో డెలివరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.

**ప్రపంచ దేశాల సాయం**

వరుస భూప్రకంపనలతో తల్లడిల్లుతున్న మయన్మార్‌కు ప్రపంచ దేశాల ఆపన్న హస్తం అందించాయి. చైనా, హాంకాంగ్, భారత్ పదుల సంఖ్యలో సహాయక సిబ్బందిని మయన్మార్‌కు పంపాయి. హాంకాంగ్, భారత్ సహాయక సామాగ్రి, ఔషధాల వంటి సామాగ్రి అందించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మయన్మార్‌కు సాయం చేస్తామని ప్రకటించారు. యూరోపియన్ యూనియన్ 27 లక్షల డాలర్లను మయన్మార్‌కు తక్షణ సహాయంగా ప్రకటించింది.

**కౌంటర్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో**

## రద్దు చేసుకోవచ్చు

**రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్**

న్యూఢిల్లీ: రైల్వే కౌంటర్‌లో తీసుకున్న రైలు టిక్కెట్లను ఆన్‌లైన్‌లో రద్దు చేసుకోవచ్చునని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం పార్లమెంట్‌లో ప్రకటించారు. వెయిట్ లిస్టెడ్ పీఆర్ఎస్ కౌంటర్ టిక్కెట్లను రద్దు చేసుకోవడం కోసం ప్రయాణికులు ఇకపై రైల్వే స్టేషన్లకు వెళ్లవలసిన అవసరం లేదన్నారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ద్వారా లేదా 139 ఫోన్ నంబరుకు కాల్ చేసి టిక్కెట్‌ను రద్దు చేసుకోవచ్చునని తెలిపారు. డబ్బుల కోసం రైల్వే రిజర్వేషన్ సెంటర్‌కు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఒరిజినల్ టిక్కెట్‌ను ఇచ్చి, డబ్బు తీసుకోవచ్చునని చెప్పారు. ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు వెల్లడించారు.

## 2 వేల కిలో న్యూటన్ల బలంతో సెమీ క్రయోజెనిక్ ఇంజిన్

బెంగళూరు: సెమీ క్రయోజెనిక్ ఇంజిన్ డిజైన్, అభివృద్ధిలో ఇస్రో చెప్పుకోదగ్గ పురోగతి సాధించింది. 2,000 కిలో న్యూటన్ల బలంతో ఈ ఇంజిన్‌ను రూపొందించగలిగింది. లాంచ్ వెహికిల్ మార్క్-3 సెమీ క్రయోజెనిక్ బూస్టర్ స్టేజ్‌ని బలోపేతం చేస్తుంది. తమిళనాడులోని మహేంద్రగిరి, ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఈ నెల 28న నిర్వహించిన పరీక్షలో ఈ ముందడుగు పడిందని ఇస్రో ప్రకటించింది.

# మరో 17 మంది నక్సల్స్ మృతి

- ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ నలుగురు జవాన్లకు గాయాలు
- మృతుల్లో ఎస్‌జడ్‌సీఎం జగదీశ్, 11 మంది మహిళలు



కొత్తగూడెం ప్రగతి మైదాన్, సుబేదారి, హిమాయత్ నగర్, మార్చి 29 : ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య సాగిన ఎదురు కాల్పుల్లో 17 మంది మావోయిస్టులు మృతి చెందగా.. నలుగురు జవాన్లు గాయపడ్డారు. మృతుల్లో రూ.25 లక్షల రివార్డు ఉన్న పెద్ద క్యాడర్ మావోయిస్టు కూడా ఉన్నారు. సుక్మా జిల్లా కేరళపాల్‌లో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. రెండు ఏకే-47 గన్‌లు, ఎస్ఎల్ఆర్‌లతో పాటు 12 ఆయుధాలను జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో 11 మంది మహిళలు, రూ.25 లక్షల రివార్డు ఉన్న స్టేట్ జోనల్ కమిటీ సభ్యుడు జగదీశ్ అలియాస్ బుద్ర ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు.

**హంతక కగార్ దాడులను ఖండించండి**

ఛత్తీస్‌గఢ్‌లో జనవరి 12 నుంచి మార్చి 25 వరకు 78 మంది మావోయిస్టులను, ఆదివాసీలను హతమార్చిన కేంద్ర, రాష్ట్ర హంతక కగార్ దాడులను ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాలు ఖండించాలని మావోయిస్టు పార్టీ బస్తర్ డివిజన్ అధికార ప్రతినిధి మోహన్ పిలుపునిచ్చారు. బూటకపు ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపేయాలని పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# స్క్రీనింగ్‌కు గైర్హాజరుతో మరణ ముప్పు!

**పురుషుల్లో 45% పెరిగే అవకాశం.. ప్రొస్టేట్ క్యాన్సర్‌పై పరిశోధకులు**

న్యూఢిల్లీ: ప్రొస్టేట్ క్యాన్సర్ స్క్రీనింగ్ అపాయింట్‌మెంట్లను తరచూ ఎగ్గొట్టే పురుషులు అదే వ్యాధితో మరణించే ముప్పు 45 శాతం పెరుగుతుందని పరిశోధకులు హెచ్చరించారు. యూసీ ఫ్రాన్సిస్కో (యూసీఎస్ఎఫ్) ప్రకారం.. పురుషుల్లో ప్రొస్టేట్ క్యాన్సర్ అత్యంత సాధారణమైన క్యాన్సర్. క్యాన్సర్ సంబంధిత మరణాలకు ప్రొస్టేట్ క్యాన్సర్ రెండో ప్రధాన కారణం. యూరోపియన్ యూనియన్‌లోని ఫిన్‌లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, స్వీడన్, స్విట్జర్లాండ్, బెల్జియం, స్పెయిన్ దేశాల నుంచి సమాచారాన్ని ఈ అధ్యయనంలో వినియోగించారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రొస్టేట్ క్యాన్సర్ స్క్రీనింగ్ అధ్యయనం. నెదర్లాండ్స్‌లోని ఎరాస్మస్ ఎంసీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం ప్రకారం, స్క్రీనింగ్స్‌లో పాల్గొనాలని 72,460 మంది పురుషులను ఆహ్వానించారు. అయితే, ప్రతి ఆరుగురిలో ఒకరు ఈ స్క్రీనింగ్ అపాయింట్‌మెంట్లకు గైర్హాజరయ్యారు. స్క్రీనింగ్‌కు సక్రమంగా హాజరైనవారు, ఎగ్గొట్టినవారు ప్రొస్టేట్ క్యాన్సర్‌తో మరణించే ముప్పును విశ్లేషించినపుడు, ఎగ్గొట్టినవారికి 45 శాతం ఎక్కువ మరణ ముప్పు ఉన్నట్లు వెల్లడైంది.

# మా నాన్న చెట్లను క్షమాపణ కోరేవారు

**పర్యావరణ పరిరక్షణ ముఖ్యమైందే: రాష్ట్రపతి**



ఢిల్లీ, మార్చి 29: ప్రకృతిలో సహజంగా లభించే వనరులను వినియోగించే ముందు తన తండ్రి క్షమాపణలు కోరేవారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. చెట్లను నరికే ముందు, దుక్కి దున్నే ముందు క్షమాపణలు అడిగేవారని పేర్కొన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ పర్యావరణ సదస్సు-2025ను రాష్ట్రపతి ముర్ము శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ఆమె సందేశమిచ్చారు. 'చెట్లు బతికున్నంత కాలం పూలు, పండ్లు ఇస్తాయని, మోడువారాక కూడా మనకు ఉపయోగపడుతున్నాయని మా నాన్న చెప్పారు' అని తన చిన్ననాటి జ్ఞాపకాలను రాష్ట్రపతి గుర్తు చేసుకున్నారు. అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా ముఖ్యమని, ఈ సదస్సులో దానికి సమాధానం కనుగొనాలని ఆమె సూచించారు. పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

**పిల్లలు మాస్కులేసుకొని ఆడుకోవాలా?**

ఆరు బయట మాస్కులు వేసుకుని ఆడుకునే వాతావరణాన్ని పిల్లలకు కల్పించరాదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ పిలుపునిచ్చారు. కాలుష్యాన్ని నివారించడానికి కాలుష్య కారకాల నియంత్రణ, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చే టెక్నాలజీల ఉపయోగాన్ని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఆర్థిక ప్రగతి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ఉండే విధంగా పరిష్కార మార్గాలను అన్వేషించాలని కోరారు. గ్రీన్ టెక్నాలజీపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆరు బయట మాస్కులు వేసుకుని ఆడుకునే వాతావరణంలో మన పిల్లలు పెరగకూడదని ఆయన అన్నారు.

# సెమిస్టరంతా పరిశ్రమల్లోనే

- కొత్తగా అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ కోర్సులు
- యూజీసీ మార్గదర్శకాల విడుదల



హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : పరిశ్రమలను విద్యాసంస్థలతో అనుసంధానించడం, పరిశ్రమల్లో నైపుణ్య అంతరాలను తగ్గించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) కీలక నిర్ణయం తీసుకున్నది. కొత్తగా అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రాం(ఏఈడీపీ) కోర్సులను యూజీసీ అందుబాటులోకి తీసుకొచ్చింది. మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ కోర్సుల్లో చేరినవారు సెమిస్టర్ మొత్తం పరిశ్రమల్లోనే పనిచేయాల్సి ఉంటుంది. మూడేండ్ల డిగ్రీ కోర్సులో కనిష్ఠంగా ఒక సెమిస్టర్ మొత్తం అప్రెంటిస్‌షిప్ రూపంలో పనిచేయాల్సి ఉంటుంది. గరిష్ఠంగా మూడు సెమిస్టర్లు పనిచేసుకోవచ్చు. నాలుగేండ్ల డిగ్రీ కోర్సులో కనిష్ఠంగా రెండు సెమిస్టర్లు, గరిష్ఠంగా నాలుగు సెమిస్టర్లు అప్రెంటిస్‌షిప్ రూపంలో పరిశ్రమల్లో పనిచేయవచ్చని యూజీసీ వెల్లడించింది. ఇకపై కంపెనీలు కాంట్రాక్ట్ అప్రెంటిస్‌షిప్ లేదా ఆన్ జాబ్ ట్రైనింగ్, ప్రాక్టికల్ ట్రైనింగ్ కింద డిగ్రీ విద్యార్థులను తీసుకోవచ్చు. పరిశ్రమ 30-40శాతం, ఫ్యాకల్టీ 30-40శాతం మూల్యాంకనం చేస్తారు. సెమినార్ ప్రజెంటేషన్, వైవాకు 20-40శాతం వెయిటేజీ ఉంటుంది. మూడు నెలల అప్రెంటిస్‌షిప్‌నకు 10 క్రెడిట్లు ఉంటాయి. స్టైపెండ్ కూడా ఇస్తారు.